సాక్షి అనంతపురం

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.18,890

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,890 వేలు ప్రకారం ధర పలికాయి.



ఉంటారా .. ఊడతారా !

జేఎన్‌టీయూ అనంతపురంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. IIలో

గరిష్టం/కనిష్టం

41.2°/23.8°

జిల్లాలో శనివారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచాయి.

న్యూస్‌రీల్

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ, కేజీబీవీ, ఎస్సీ సంక్షేమ శాఖల తరఫున 48 మంది విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రం, మెమొంటో ప్రదానం చేసి సన్మానించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అనంత ఆణిముత్యాలు ద్వారా ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో హైకోర్టు జడ్జి



జడ్జికి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రాష్ట్ర హైకోర్టు జడ్జి హరి హరనందశర్మ శనివారం రాత్రి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు స్వామివారి ఫొటో, శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.



శనివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపిస్తున్న అనంతపురంలోని టవర్ క్లాక్ ప్రాంతం

నిప్పుల వాన

భానుడు నిప్పుల వాన కురిపిస్తున్నాడు. వడగాల్పులు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు రావాలంటేనే భయపడుతున్నారు

భారీగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

- ఏప్రిల్‌లోనే 42 డిగ్రీలను దాటుతున్న వైనం
- మేలో 45 డిగ్రీల వరకూ వెళ్లే అవకాశం ఉందంటున్న శాస్త్రవేత్తలు
- వృద్ధులు, బాలింతలు, చిన్నారులు బయటకు రావద్దంటున్న వైద్యులు



ఎండ దెబ్బకు తాళలేక చలివేంద్రం వద్ద నీరు తాగుతున్న వాహనదారుడు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భానుడు భగ భగ మండిపోతున్నాడు. పగటి పూట ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి. ఏప్రిల్ మొదటి వారంలో 40 డిగ్రీల లోపు ఉన్న ఉష్ణోగ్రతలు తాజాగా 42 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ వేడిమికి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పట్టణాల్లో వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పల్లెటూళ్లలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఎండదెబ్బకు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లి ఇప్పటికే ఓ వ్యక్తి మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. వడదెబ్బ కేసులు పెరుగుతున్నట్లు ఆస్పత్రుల రికార్డులు వెల్లడిస్తున్నాయి.

45 డిగ్రీలు దాటే అవకాశం

గత ఏడాది ఇదే సమయానికి 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈసారి మాత్రం అప్పుడే 42 డిగ్రీలు నమోదైంది. రానున్న నెలన్నర రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మే రెండో వారం నుంచి ఎండ తీవ్రత మరింతగా ఉంటుందని, వడదెబ్బ ప్రభావం తారస్థాయికి చేరుకుంటుందని పేర్కొంటున్నారు. మరోవైపు వృద్ధులు, బాలింతలు, చిన్నారులు మధ్యాహ్నం పూట బయటకు రావద్దని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుందని వాళ్లు కూడా ఎండల్లో తిరగకూడదంటున్నారు.

వడదెబ్బకు గురికాకూడదంటే..

- మధ్యాహ్నం పూట ఇంట్లోనే ఉండాలి.
- ఎక్కువ మోతాదులో మంచినీళ్లు తీసుకోవాలి.
- ఎండలో తిరిగి వచ్చినప్పుడు కొబ్బరి నీళ్లు లేదా ఓఆర్ఎస్ తీసుకోవాలి.
- జ్వరం లేదా నీరసం అనిపించినప్పుడు వెంటనే సెలైన్ పెట్టించుకోవాలి.
- బీపీ, షుగర్, గుండెజబ్బులకు మందులు వాడే వారిలో వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. వీరు మరింత జాగ్రత్తగా ఉండాలి.
- వేసవిలో తేలికపాటి వ్యాయామాలు మాత్రమే చేయాలి.
- దోస, పుచ్చ, దానిమ్మ, అరటి వంటి పండ్లను బాగా తీసుకోవాలి.
- పండ్లతో పాటు పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటే వేడి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- జ్వరంగా ఉంటే నుదుటిపై తడిబట్టను పెట్టాలి.

వడదెబ్బ లక్షణాలు

- ✔ విపరీతమైన తలనొప్పి, వాంతికి వచ్చినట్లు ఉండటం
- ✔ నాలుక తడి ఆరిపోయినట్లు ఉండటం
- ✔ శరీర ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరగడం
- ✔ శరీరం బాగా అలసిపోయినట్లు ఉండటం
- ✔ మాట తడబడుతున్నట్లు ఉండటం
- ✔ ఒక్కోసారి కండరాలు పట్టేసినట్టు అనిపించడం
- ✔ వెంటనే నీరసం వచ్చేసి ఎక్కడైనా వాలిపోవాలనిపించడం
- ✔ శరీరం తిమ్మిరిగా అనిపించడం

ఈసారి ఎండలు ఎక్కువే

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండ తీవ్రత కాస్త ఎక్కువగానే ఉంది. మేలో 45 డిగ్రీల వరకూ నమోదు కావచ్చు. మిగతా జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉక్కపోత (హ్యుమిడిటీ) తక్కువ. ఈ ఏడాది కాస్త ముందస్తు వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

– విజయశేఖర్, సైంటిస్ట్, రేకులకుంట వాతావరణ కేంద్రం



ఎండకు తాళలేక పూలు అమ్మే మహిళ ఇలా..



ఖాళీగా కనిపిస్తున్న అనంతపురంలోని కోర్టు రోడ్డు

ఈ ఏడాది సగటు పగటి ఉష్ణోగ్రతలు ఇలా...

ఫిబ్రవరి **30.2** డిగ్రీలు	మార్చి రెండోవారం **32.7** డిగ్రీలు
మార్చి చివరలో **35.6** డిగ్రీలు	ఏప్రిల్ మొదటి వారం **39.8** డిగ్రీలు
ఏప్రిల్ చివరి వారం	**42.0** డిగ్రీలు

ముంచుకొస్తున్న గడువు

- రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30 ఆఖరు
- నేటికీ చేయించుకోని 1.32 లక్షల మంది
- రేషన్ నిలిపివేస్తామంటున్న అధికారులు



రేషన్‌షాపు వద్ద కార్డుదారులు (ఫైల్)

అనంతపురం అర్బన్: సంక్షేమానికి కోతపెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మార్గాలు పేదల పాలిట శాపంగా మారాయి. తాజాగా బియ్యం పంపిణీలో కోత పెట్టేందుకు ఈ-కేవైసీ పేరుతో మెలిక పెట్టింది. ఈనెల 30 వ తేదీలోగా రేషన్ కార్డులోని సభ్యులు ఈ-కేవైసీ చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక వేళ ఎవరైనా ఈ-కేవైసీ చేసుకోకపోతే మే నెలలో రేషన్ అందించబోమని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఈనెల 23న గుంతకల్లు ఆర్డీఓ ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే ఈ-కేవైసీ చేసుకోని యూనిట్లను మే నెలలో తొలగిస్తామని అనంతపురం రూరల్ తహసీల్దార్ ఈనెల 17న ప్రకటన విడుదల చేశారు. ఈ-కేవైసీ నమోదు గడువు ఈనెల 30తో ముగుస్తోంది. అయితే నేటికీ జిల్లా వ్యాప్తంగా 1.32 లక్షల మంది కార్డులోని సభ్యులు ఈ-కేవైసీ నమోదు చేసుకోలేదు. దీంతో వీరందరికీ మే నెలలో బియ్యం పంపిణీ నిలిచిపోనుంది.

1.32 లక్షల మందికి బియ్యం కట్

జిల్లావ్యాప్తంగా 6,60,330 బియ్యం కార్డులు ఉండగా వీటిలో 20,11,076 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఈనెల 25 తేదీ వరకూ 1,32,401 మంది ఈ-కేవైసీ చేసుకోలేదు. అధికారులు ప్రకటించిన విధంగా మే నెలలో ఈ-కేవైసీ చేసుకోని వారికి రేషన్ అందదు. యూనిట్ (సభ్యుడు)కు 5 కిలోలుగా 1.32 లక్షల మందికి సంబంధించి 6.62 లక్షల కిలోలు (662 టన్నులు) బియ్యం పంపిణీ కావు. ఒకవేళ ఈ-కేవైసీ నమోదు గడువును ప్రభుత్వం పెంచితే యూనిట్లు రద్దు కాకుండా ఉంటాయి. లేదంటే మే నెలలో యూనిట్లను రద్దు చేస్తారు.

ఈ-కేవైసీ పెండింగ్ ఇలా

రెవెన్యూ డివిజన్	కార్డులో యూనిట్లు	ఈ-కేవైసీ చేసుకోని వారు
అనంతపురం	8,54,034	47,892
గుంతకల్లు	5,34,775	35,396
కళ్యాణదుర్గం	6,22,267	49,113
మొత్తం	20,11,076	1,32,401

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ నగరపాలక సంస్థ సిబ్బందికి సూచించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్యం మెరుగుకు సంబంధించి నగరపాలక సంస్థ, మునిసిపల్ కమిషనర్లకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగు, తాగునీటి సరఫరా, వీధి లైట్లు తదితర ప్రజా అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిని పక్కాగా అమలు చేయాల్సిందేనన్నారు. ప్రధానంగా నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అందరూ సమష్టిగా పని చేయాలని, పారిశుధ్య కార్మికులను పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

ఇసుక నిల్వ చేయాలి

అనంతపురం అర్బన్: వర్షాకాలం నాటికి ఇసుక నిల్వలు 70 వేల టన్నులు ఉంచాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి అధికారులతో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

● వినూత్న నిరసన

ఉరవకొండ: 'పట్టణంలో వీధి కుక్కలతో పాటు కోతులు గుంపులుగా చేరి ప్రజలను నిత్యం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీనిపై అధికారుల చర్యలు తీసుకోవాలి' అంటూ ఉరవకొండ ఎంపీటీసీ సభ్యుడు వన్నూర్‌సాబ్ ముఖానికి కుక్క మాస్క్ ధరించి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. శనివారం నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీధి కుక్కలు, కోతులు ప్రజలు, పిల్లలపై దాడి చేస్తున్నాయని తెలిపారు. వెంటనే వాటిని నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మండల సమావేశంలో కుక్క మాస్క్‌తో వినూత్న పద్ధతిలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యుడు వన్నూర్‌సాబ్

జోధ్‌పూర్ తరహాలో మొక్కల పెంపకం

- ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖకుమార్

బొమ్మనహాళ్/కణేకల్లు: 'రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ ప్రాంతంలో సున్నితమైన ఇసుకలో అత్యంత తక్కువ సామర్థ్యం నీటితో అక్కడి రైతులు పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఆ తరహాలోనే బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తాం' అని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వై.వి.కే షణ్ముఖ కుమార్ అన్నారు. శుక్రవారం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని దర్గాహొన్నూరు, మాల్యాం, నాగేపల్లి, తుంబిగనూరు గ్రామాల్లో షణ్ముఖ కుమార్, అడిషనల్ కమిషనర్ కమిషనర్ శివప్రసాద్, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీ చంద్, అనంతపురం డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్, ఏఓ సాయికుమార్ పర్యటించారు. ఇటీవల జోధ్‌పూర్ ప్రాంతంలో రాష్ట్ర కమిటీ పర్యటించి అధ్యయనం చేసిందని డైరెక్టర్ షణ్ముఖకుమార్ తెలిపారు. ఇసుక దిబ్బల్లో పర్యటిస్తూ కొందరు రైతులు సాగు చేసిన పండ్ల మొక్కలను పరిశీలించి రైతులతోనూ మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఇసుక దిబ్బల్లో ఏఏ పంటలు సాగుకు అనువైనవి అనే విషయంపై పరిశీలన చేసి ఈ ఏడాది నుంచే రైతులకు పండ్ల మొక్కల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న వారికి ఉపాధి పథకం ద్వారా మొక్కలు అందిస్తామని, ఎక్కువ భూములు ఉన్న రైతుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.



ఇసుక దిబ్బల్లో పర్యటిస్తున్న అధికారులు

క్లుప్తంగా

ఉద్యోగం రాదేమోనని యువకుడి బలవన్మరణం


మృతుడు సుదర్శన్‌రెడ్డి

పెద్దవడుగూరు: ఉద్యోగం రాదేమోనని ఆందోళనతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కాశేపల్లి గ్రామానికి చెందిన యాపర్ల చెన్నారెడ్డికి ఇద్దరు కుమారులుండగా పెద్దకుమారుడు ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. చిన్నకుమారుడు యాపర్ల సుదర్శన్‌రెడ్డి(22) కొన్ని నెలలుగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇటీవల జరిగిన ఆర్మీ సెలక్షన్స్‌లో రన్నింగ్ పరీక్షలో ఎంపికయ్యాడు. అయినా తనకు ఉద్యోగం వస్తుందో రాదోనని మదనపడేవాడు. ఇదే విషయమై కుటుంబ సభ్యులతో పలుమార్లు చర్చించాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం గుత్తిఅనంతపురం వద్దనున్న సుంకులమ్మతల్లి ఆలయ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని భోరున విలపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఐటీకి ఇన్నోవేషన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా యాజమాన్యం పని చేస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ పేర్కొన్నారు. కళాశాల ఇన్నోవేషన్ సెల్, క్యాంపస్‌లో వ్యవస్థాపకత, ఆవిష్కరణ, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడంలో చేసిన అత్యుత్తమ కృషికి 2025 ఇన్నోవేషన్ అవార్డును ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల అందుకుందన్నారు. ఈ అవార్డును రెండు రోజుల కిందట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కట్టా రామోహన్‌రావు నుంచి అందుకున్నామన్నారు. ఎస్‌ఆర్‌ఐటీ ఆవిష్కరణలు, స్టార్టప్‌లను పెంపొందించడంలో మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయుల కృషి, అంకితభావానికి ఈ అవార్డు నిదర్శనమన్నారు. అదే విధంగా గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వర్క్‌షాపులో కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ థర్డియర్ విద్యార్థి మహమ్మద్ ఇలియాస్ తన ఇన్నోవేషన్ ఇ-వాట్‌తో ఉత్తమ ఇన్నోవేషన్ అవార్డును అందుకున్నారన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన డాక్టర్ ఆంజనేయులను కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి చైతన్య కిశోర్ అభినందించారు.

ఉంటారా.. ఊడతారా!

- జేఎన్‌టీయూ(ఏ)లో 2017లో 9 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ
- ప్రొఫెసర్లను తొలగించాలంటూ గతంలో హైకోర్టు ఆదేశాలు
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రొఫెసర్లు
- తాజాగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని సుప్రీం ఆదేశాలు


జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రొఫెసర్ పోస్టుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని రెండు వారాల్లో తెలియజేయాలని కోరింది. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి వాస్తవాలు తెలియజేయాల్సి రావడంతో వివరాలు ఎలా పంపాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు. వాస్తవాలు కప్పిపుచ్చి సుప్రీంకోర్టుకు పంపితే చర్యలు తప్పవనే ఉద్దేశంతో ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు తోసిరాజని..

- జేఎన్‌టీయూ అనంతపురంలో పరిధిలో అనంతపురం, కలికిరి, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలల్లో 10 ప్రొఫెసర్ ఉద్యోగాలకు అక్టోబర్ 10, 2017న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 9 మందిని ఎంపిక చేశారు. ముగ్గురి విషయంలో అన్ని నిబంధనలూ తుంగలో తొక్కారు. పీహెచ్‌డీ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉంటేనే ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు. కానీ అనంతపురం జేఎన్‌టీయూలో ప్రొఫెసర్లుగా నియమితులైన ముగ్గురు అభ్యర్థులకు ఐదేళ్ల అర్హత లేదు. కంప్యూటర్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా నియమితులైన అభ్యర్థి 2014లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2017 సంవత్సరానికి నోటిఫికేషన్ ఇచ్చిన సమయానికి ఐదేళ్ల అనుభవం లేదు. అయినా ప్రొఫెసర్ పోస్టుకు ఎంపిక చేశారు. మరో అభ్యర్థి ఈఈఈ విభాగంలో జేఎన్‌టీయూ కాకినాడలో 2017 జనవరిలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. నోటిఫికేషన్ ఇచ్చిన సమయానికి కేవలం 8 నెలల అనుభవం మాత్రమే ఉంది. 2015లో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థికి ఐదేళ్ల అనుభవం ఉందని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని కట్టబెట్టారు. ఇదే అభ్యర్థి 2007 ఎస్కేయూలో పాలిమర్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. పాలిమర్ పీహెచ్‌డీని పరిగణనలోకి తీసుకుని ఏ మాత్రం సంబంధం లేని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు.

హైకోర్టులో కేసు..

ఈ అంశంపై కొందరు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో 'గ్రూప్ విధానం తప్పు.. సబ్జెక్టు ఆధారంగా రిజర్వేషన్ అమలు చేయాలి. రోస్టర్ విధానం పోస్టుల ఆధారంగా ఉండాలి. ఖాళీల ఆధారంగా చేయడం చెల్లదు. మహిళలకు, దివ్యాంగులకు హారిజాంటల్ రిజర్వేషన్ వర్తిస్తుంది. ప్రస్తుత నోటిఫికేషన్లు తప్పు. నోటిఫికేషన్లు సరిచేయాలి' అని హైకోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. ఈ తీర్పునకు లోబడి 9 మంది ప్రొఫెసర్లను విధుల నుంచి జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ తొలగించారు.

హైకోర్టు బెంచుకు అప్పీలు

సింగిల్ జడ్జి తీర్పును వ్యతిరేకిస్తూ 9 మంది ప్రొఫెసర్లు తిరిగి హైకోర్టు బెంచ్‌కు అప్పీలు చేశారు. ఉద్యోగ తొలగింపు ఉత్తర్వులపై స్టే విధించారు. 2023, ఆగస్టు 4వ తేదీన హైకోర్టు బెంచ్ సైతం సింగిల్ జడ్జి తీర్పును ఏకభవిస్తూ తీర్పు వెలువరించింది. ప్రొఫెసర్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేయాలని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. దీంతో తిరిగి హైకోర్టు బెంచ్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోరింది. హైకోర్టు ఈ నియామకాలు చెల్లదని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రొఫెసర్లను సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి విధుల్లో కొనసాగిస్తున్నారు. 2023 ఆగస్టు 04వ తేదీన హైకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని సూచించాలని పేర్కొనడంతో 9 మంది ప్రొఫెసర్లలో ఆందోళన నెలకొంది.

జిల్లాలో విస్తృత తనిఖీలు


కళ్యాణదుర్గం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం: పెహల్గాంలో ఉగ్ర దాడి నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో జిల్లా అంతటా శనివారం ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ప్రత్యేక బృందాలు ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జన సమ్మర్దం కలిగిన ప్రాంతాలు, హోటళ్లు, లాడ్జీల్లో సోదాలు నిర్వహించాయి. సరిహద్దు ప్రాంతాల్లోనూ ముమ్మర తనిఖీలు చేపట్టారు. పార్శిల్ కార్యాలయాలను సైతం విస్తృతంగా తనిఖీ చేశారు.

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం వన్ టౌన్ సీఐ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎఆర్ హెడ్ క్వార్టర్ నుంచి ప్రత్యేక టీమ్‌తోపాటు డాగ్ స్కాడ్‌తో స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లతోపాటు ప్రయాణికుల రెస్టరూములు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులకు చెందిన బ్యాగులను తనిఖీ చేశారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలో శనివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ పార్శిల్ సర్వీస్‌లలో వచ్చిన పార్శిల్ బాక్స్‌లను జాగిలాలతో సోదాలు చేయించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ ఖాజాబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఏడాది 25,107 భూసార పరీక్షలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేపట్టాలని కమిషనరేట్ నుంచి లక్ష్య నిర్దేశన చేశారని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శనివారం స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్)ను జేడీఏ సందర్శించారు. మే 25 లోపు క్షేత్రస్థాయి నుంచి ఏఓలు, ఏఈఓలు, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల ద్వారా మట్టి నమూనాలు ప్రయోగశాలలకు చేరుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చిన నమూనాలు వెంటనే ప్రయోగశాలలో 12 రకాల పరీక్షలు, విశ్లేషణలు జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గడువులోపు నమూనాలు సేకరణ, విశ్లేషణలు, ఆన్‌లైన్, రైతులకు హెల్త్‌కార్డుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎరువుల ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా భూసార పరీక్షలు అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఎస్కే యూనివర్శిటీ విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా ప్రయోగశాలలో భూసార పరీక్షల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జేడీఏ ముచ్చటించారు. ఏడీఏ పుష్పలత, ఏఓలు శేఖర్‌రెడ్డి, పి.శ్రీనాథ్‌రెడ్డి, ప్రతాప్, ఉమామహేశ్వరి, ఏఈఓ గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

'కేఎస్‌ఎన్' హాస్టల్‌లో ఎలుకల సంచారం

- విద్యార్థినులను కొరికిన ఎలుకలు
- మూడు రోజుల కిందట ఘటన
- గోప్యంగా ఉంచిన ప్రిన్సిపాల్
- కళాశాల యాజమాన్యాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి, మహిళా విభాగం నేతలు


ఎలుక కొరికిన విద్యార్థిని కాలిని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, చంద్రశేఖర్‌యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని కేఎస్‌ఎన్ మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఎలుకల సంచారం ఎక్కువైంది. ఈ క్రమంలో మూడురోజుల కిందట నిద్రిస్తున్న పలువురి విద్యార్థినులను కొరికి గాయాలు చేశాయి. అధ్యాపకులు హుటాహుటిన ఆ విద్యార్థినులను సర్వజన ఆస్పత్రికి పిలుచుకెళ్లి ఇంజెక్షన్లు వేయించారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ప్రిన్సిపాల్ అత్యంత గోప్యంగా ఉంచారు. ఎట్టకేలకు విద్యార్థినుల బంధువుల ద్వారా వెలుగులోకి వచ్చింది. నిర్మాణంలో ఉన్న హాస్టల్ భవనంలో ఎలుకల బెడద అధికంగా ఉంటోందని విద్యార్థినులు వాపోతున్నారు. దీనికితోడు పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఎలుకలతో పాటు పందికొక్కులు సంచరిస్తున్నాయని చెబుతున్నారు. హాస్టల్ వార్డెన్‌తో పాటు హాస్టల్‌కు ఏమాత్రం సంబంధం లేని తిమ్మారెడ్డి అనే అధ్యాపకుడు విద్యార్థినులపై తిరగబడ్డారని బంధువులు వాపోతున్నారు. భద్రతా చర్యలు కల్పించడంలో విఫలమైన యాజమాన్యం నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇలా ఎదురుదాడికి దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థినులపై ఎలుకలదాడి దారుణం కేఎస్‌ఎన్ బాలికల కళాశాల వసతిగృహంలో విద్యార్థినులను ఎలుకలు కొరకడం దారుణమని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మండిపడ్డారు. శనివారం వారు కళాశాలకు వెళ్లి బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలోనూ ఈ కళాశాలలో ఆహార నాణ్యత సరిగా లేదని విద్యార్థినులు ఆందోళన చేశారన్నారు. ఈ ఘటన మరవకముందే విద్యార్థినులను ఎలుకలు కొరకడం దారుణమన్నారు. ఘటనపై మీద ఒక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం, మహిళా విభాగం నగర అధ్యక్షులు కైలాస్, చంద్రలేఖ, నాయకులు వెంకట్, రాహుల్ రెడ్డి, నవాజ్, బాలు, రాంభూపాల్ రెడ్డి, సూర్య, గంగ శివుడు, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

మే 20న ఎల్‌ఐసీ ఉద్యోగుల సమ్మె

- అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్


మాట్లాడుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సతీష్

అనంతపురం అగ్రికల్చర్: ఎల్‌ఐసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల మే 20న సమ్మెలోకి వెళుతున్నట్లు ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి.సతీష్ తెలిపారు. శనివారం స్థానిక బళ్లారిరోడ్డులో ఉన్న ఎల్‌ఐసీ బ్రాంచి-2 కార్యాలయంలో డివిజన్ ఉపాధ్యక్షుడు సూరిబాబు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సతీష్ హాజరై మాట్లాడారు. కోట్లాది మంది ప్రజలకు విశేష సేవలందిస్తున్న ఎల్‌ఐసీని బలహీన పరిచే కుట్ర జరుగుతోందన్నారు. ఎల్‌ఐసీలోకి విదేశీ పెట్టుబడులు వద్దని డిమాండ్ చేశారు. అందరికీ పెన్షన్, పెన్షన్ అప్డేషన్, స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ కోసం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలవెన్సుల పట్ల విపక్ష చూపుతున్నారని, నూతన రిక్రూమెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలన్నారు. అనేక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు ఎ.రఘునాథరెడ్డి, అక్బర్ బాషా, శ్రీనివాసులు, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాప సూచకంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

యూటీఎఫ్ నేత నాగేంద్రబాబు మృతి


నాగేంద్రబాబు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధ్యాయ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నేత, రిటైర్డ్ పీఎస్‌హెచ్‌ఎం సీకే నాగేంద్రబాబు (64) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈయన కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో మంచానికే పరిమితయ్యాడు. మంచంపై ఉంటూనే ఫేస్బుక్, వాట్సాప్ ద్వారా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం స్పందించే వారు. సోషల్ మీడియా వేదిక ద్వారా ఆయన స్పందిస్తున్న తీరును చూసిన చాలామంది ఉపాధ్యాయులు...నాగేంద్రబాబు బాగా ఆరోగ్యంగానే ఉన్నాడని భావించేవారు. ఆయన మృతి సమాచారం తెలియగానే ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కల్మషం లేని వ్యక్తిత్వం, నిజాయతీ, నిస్వార్థ నాయకుడు, నిరాడంబరమైన జీవనం, సంఘం పట్ల ఆయన నిబద్ధత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆయన కేటాయించిన సమయం వెలకట్టలేనిదని ఉపాధ్యాయులు గుర్తు చేసుకుంటున్నారు. యూటీఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షునిగా కొంతకాలం చేసి, కీలకమైన జిల్లా అధ్యక్షునిగా 5 సార్లు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా 6 సార్లు, రాష్ట్ర కార్యదర్శిగా 5 సార్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 5 సార్లు ఇలా దాదాపు 30 ఏళ్లపాటు యూటీఎఫ్ కోసం పనిచేశారు. శనివారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు లింగమయ్య, గోవిందరాజులు, సుధాకర్, కోటేశ్వరప్ప, రమణయ్య, రామప్ప, సుబ్బరాయుడు, శేఖర్, మహమ్మద్ జిలాన్, శ్రీనివాసులు నాయుడు, నాగరాజు, హెంద్రీ, బీకే నారాయణ తదితరులు నాగేంద్రబాబు భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఈడిగ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన జిల్లాలోని ఈడిగ కుల విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఈడిగ (గౌడ) ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.విశ్వనాథ్, ప్రధానకార్యదర్శి ఎస్.మనోహర్ శనివారం తెలిపారు. పదో తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 450కు పైగా మార్కులు సాధించిన వారు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి 500 మార్కులకు పైగా సాధించిన వారు అర్హులన్నారు. ఇంటర్‌కు సంబంధించి ప్రభుత్వ కళాశాలల్లో చదివి 800 మార్కులకు పైగా సాధించిన వారు, ప్రైవేట్ కళాశాలల్లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన విద్యార్థులు మే 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్కుల మెమో, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు ప్లాట్ నంబరు 311, అనన్య అపార్ట్‌మెంట్, ప్రియాంకనగర్, అనంతపురం -515004 చిరునామాకు పంపాలన్నారు. అలాగే 79890 38176, 99856 04329, 87907 90435 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతులు చేపట్టాలి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కోర్టు కేసులతో ఆగిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ పదోన్నతుల కేసులో కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వెంటనే పదోన్నతులు చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో నిలిచిపోయిన పీఎస్ హెచ్‌ఎం పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ సర్వీసు రూల్స్, మున్సిపల్ సర్వీసు రూల్స్ వేరుగా ఉన్నందున ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆగిపోయిన మున్సిపల్ ఉపాధ్యాయుల ఇంగ్లిష్ పదోన్నతులను చేపట్టాలన్నారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఉన్న లోపాలను సరి చేయాలన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, ఫణిభూషణ్, సుగుమంచి సురేష్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

బాధితులకు వైఎస్సార్‌సీపీ అండ


అంజన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: కూటమి నాయకుల అక్రమాలు బయటపెడుతుంటే దాడులకు తెగబడుతున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడొద్దని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి భరోసా కల్పించారు. వారం రోజుల క్రితం రఘునాథపురం గ్రామంలో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేత అంజన్‌రెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. శనివారం ఆలూరు సాంబశివారెడ్డి గ్రామానికి వెళ్లి అంజన్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం చిన్నజలాలపురం గ్రామంలో ఉద్యోగం రాలేదని ఆత్మహత్య చేసుకున్న హరినాథరెడ్డి తండ్రి ఆదిరెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎన్పీ నారాయణ, గురుమూర్తిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్, ఎల్ రాజు ఉన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

తాడిపత్రిటౌన్: పోక్సో కేసులో తాడిపత్రి పోలీసులు కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన రామాంజనేయులను అరెస్ట్ చేశారు. వివరాలు... రామాంజనేయులు తాడిపత్రిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన 17 ఏళ్ల బాలికతో ఇన్‌స్టాగ్రాంలో పరిచయమయ్యాడు. మాయమాటలతో ఆరు నెలల క్రితం బాలికను పెళ్లి చేసుకుని గర్భవతిని చేశాడు. నెల రోజులుగా బాలికను వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె తాడిపత్రిలోని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఈనెల 5న రామాంజనేయులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేవారు. నిందితుడు శనివారం భగత్‌సింగ్ నగర్‌లో తిరుగుతుండటంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఊరెళ్తే .. జాగ్రత్తలు తప్పనిసరి

- ఎస్పీ జగదీశ్

అనంతపురం: వేసవి సెలవుల్లో ఊరికెళ్తున్నారా అయితే ముందస్తు జాగ్రత్తలు తప్పక పాటించాలంటున్నారు అనంతపురం ఎస్పీ జగదీశ్. అహర్నిశలు కష్టపడి సంపాదించిన సొమ్ము, విలువైన వస్తువులు దొంగల పాలు కాకుండా ఉండాలంటే తమ సూచనలు, సలహాలు పాటించాలని ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా ఇళ్లకు తాళం వేసి పెళ్లిళ్లు, విహార యాత్రలకు వెళ్లే వారు విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఒక వేళ లాకర్లు వద్దనుకుంటే బంధువులు లేదా తెలిసిన వారి ఇళ్లల్లో భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. విలువైన వస్తువుల బ్యాగులు, సూట్‌కేసులతో ప్రయాణాలు చేసేటప్పుడు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. సెలవులు ముగించుకొని సొంత ఇళ్లకు చేరే వరకు పాలు, పెరుగు వేసే వారితో పాటు పేపర్ బాయ్‌లకు వద్దని చెప్పాలన్నారు.

క్లుప్తంగా

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



టెర్రరిజాన్ని అంతం చేయాలన్న పోస్టర్లను ప్రదర్శిస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: పహల్గాంలో ఉగ్ర దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం డిమాండ్ చేశారు. శనివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యులకు మేయర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటన తనను ఎంతో బాధించిందన్నారు. పహల్గాం దాడికి కారకులైన వారిని వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, నగర ఉపాధ్యక్షుడు ఇషాక్, కార్పొరేటర్లు రహంతుల్లా, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, నాయకులు కుళ్లాయస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తేడాలుంటే చర్యలు తప్పవు

- ఐసీడీఎస్ పీడీ నాగమణి హెచ్చరిక



రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి

అనంతపురం సెంట్రల్: అనాథలు, నిరాదరణకు గురైన 18 నుంచి 45 ఏళ్లలోపు యువతులు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి తెలిపారు. శనివారం కళ్యాణదుర్గం రోడ్డులోని సెరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శక్తి సదన్‌ను పరిశీలించారు. అక్కడ ఉపాధి పొందుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే టైలరింగ్ నేర్చుకుంటున్నట్లు గుర్తించారు. తక్కిన వారు ఎక్కడున్నారని ప్రశ్నించగా శిక్షణ తీసుకొని వెళ్తుంటారని నిర్వాహకులు తెలిపారు. మరోసారి ఆకస్మిక తనిఖీకి వస్తానని ఆన్‌లైన్‌లో ఉన్న లెక్కలకు, వాస్తవంగా ఉన్న వారికి తేడాలుంటే మాత్రం నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అనాథ, నిరాధరణకు గురైన యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

'ఆణిముత్యాలు'కు రూ.50 వేల వితరణ



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు నారాయణస్వామి

అనంతపురం అర్బన్: అనంత ఆణిముత్యాలు కార్యక్రమానికి కలెక్టరేట్ భూ సంస్కరణల విభాగం తహసీల్దారు టి.నారాయణస్వామి రూ.50 వేల విరాళం అందించారు. శనివారం ఆయన కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన అణిముత్యాలు కార్యక్రమానికి తమ వంతుగా విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిరంతర నిఘా ఉండాలి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచిన గోదాముల వద్ద నిరంతర నిఘా, పటిష్ట భద్రత ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాములను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉండాలన్నారు. పరిసరాల్లోకి ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ. 25 వేల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ఈఈ రవిశంకర్

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ పునఃప్రారంభించిన అనంత ఆణిముత్యాలు కార్యక్రమానికి విద్యుత్‌శాఖ ఈఈ వీఎం రవిశంకర్ రూ.25 వేలు విరాళం ఇచ్చారు. కలెక్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఈఈ కలిసి చెక్‌ను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద విద్యార్థుల విద్య ఆగిపోకూడదన్నారు. సామాజిక బాధ్యతగా వారికి ఉన్నత విద్యను అందించేందుకు చేపట్టిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు.

పనులు సరే.. పర్యవేక్షణేదీ ?

- శారదనగర్‌లో ఇష్టారాజ్యంగా బీటీ రోడ్డు పనులు
- పనులను పరిశీలించని ఇంజినీర్లు
- కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూరుస్తున్నారని విమర్శలు



శారదనగర్ 1వ క్రాస్‌లో ఇష్టారాజ్యంగా రోడ్డు తవ్విన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీర్ల బాధ్యతారాహిత్యం కాంట్రాక్టర్లకు వరంగా మారుతోంది. రూ.లక్షలతో ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనులపై ఇంజినీర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని 23వ డివిజన్ శారదనగర్ 1వ క్రాస్‌లో జరుగుతున్న బీటీ రోడ్డు పనులే అందుకు నిదర్శనమని చెప్పాలి. ఈ నెల 15న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.56 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కాగా బీటీ రోడ్డు పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. రోడ్డును సరైన స్థాయిలో కట్టింగ్ చేయలేదు. ఒక వైపు చెట్ల పేరుతో ఇష్టానుసారంగా గుంతలు తవ్వారు. రోడ్డు తవ్వకాల్లోనూ సరైన కొలతలు తీసుకోవడం లేదు. ఒక వైపు మాత్రమే తవ్వకాలు జరిపారు. అందులోనూ కొన్ని ఇళ్లకు ర్యాంప్‌లు ఉన్నాయని వాటిని వదిలేశారు. వాస్తవంగా ర్యాంప్‌లను తొలగించాల్సి ఉంది. ర్యాంపులను తొలగించకుండా.. రోడ్డును తూతూ మంత్రంగా వేయడం ద్వారా కాంట్రాక్టర్‌కు భారీగా లబ్ధి చేకూర్చేలా ఇంజినీర్లు పరోక్షంగా సహకరిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఎస్ఈ క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తా లేని ఇంజినీర్లు

రూ.లక్షల అభివృద్ధి పనులు జరుగుతుంటే ఇంజినీర్లు పత్తా లేకుండా పోయారు. డీఈ, ఏఈ, అమినిటీల్లో ఒకరైనా పనులను పరిశీలించాలి. కానీ అలాంటి పరిస్థితి లేదు. వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించి ఇళ్లలో నిద్రపోతున్నారన్న విమర్శలున్నాయి. వాస్తవంగా నగరపాలక సంస్థలో ఇంజినీర్ల పనితీరు అధ్వాన్నంగా ఉంది. ఎస్ఈ, ఇద్దరు ఈఈలు, డీఈలు, ఏఈలు, అమినిటీలు అందుబాటులో ఉన్నా.. వారి పనులను పర్యవేక్షించడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. అసలు వారు నగరపాలక సంస్థకు సరిగా రావడం లేదు. క్షేత్రస్థాయి పర్యటన పేరుతో పత్తా లేకుండా పోతున్నారు. కొందరు అధికారులకు వాహనం ప్రొవిజన్ ఉండడంతో వారు ఎక్కడికి వెళ్తున్నారో..ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి.

సేవలు చిరస్మరణీయం



పదవీ విరమణ పొందిన ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: ఉద్యోగ విరమణ అనివార్యమైనప్పటికీ, సేవలు చిరస్మరణీయమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. వర్సిటీ ఆడిటోరియంలో శనివారం పదవీ విరమణ పొందిన 44 మంది ఉద్యోగులను సత్కరించారు. 2022–23 నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్లను, బోధనేతర ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధనోత్సవం



అక్కల్ కోట్ మహరాజ్ ఆశ్రమంలో పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే ఏకైక అవధూత స్వరూపులు అక్కల్‌కోట్ మహారాజ్ ఆశ్రమంలో 147వ ఆరాధనా ఉత్సవం సందర్భంగా భక్తజనంతో సందడిగా మారింది. శనివారం హెచ్చెల్సీ కాలనీలో వెలసిన వలీస్వామి ఆశ్రమంలో అక్కల్‌కోట మహారాజ్ ఆరాధన వేడుకలను ఆశ్రమ నిర్వాహకులు దేవనూరు సుందరం విజయ్‌కుమార్ స్వామీజీ చరిత్ర పఠనంతో ప్రారంభించారు. అనంతరం వివిధ పూజలు చేశారు. సాయంత్రం పూల పల్లకీలో అక్కల్‌కోట్ మహారాజ్ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు టీసీ జయచంద్రారెడ్డి, కొండారెడ్డి, చెన్నారెడ్డి, సీతారామశాస్త్రి, నీలిమ, బాలాజీ, కేవీఎస్ చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో దొంగల స్వైర విహారం



నగరంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం: నగరంలో దోపిడీ దొంగలు స్వైర విహారం చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకూ ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. నాలుగో రోడ్డు ఎక్స్‌టెన్షన్ శాంతినగర్ గౌరవ గార్డెన్స్‌లో ఉండే ఐదు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేశారు. గౌరవ్ గార్డెన్ రెండో క్రాస్‌లో ఆర్. మణికంఠ, డి.మహేశ్వరరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, రాజమౌళి, నీలిమ ఇంటి యజమానులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి తలుపులకు వేసిన తాళాలతో పాటు ఇన్నర్ లాకులను సైతం దొంగలు తొలగించారు. ముందుగా తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు తెగబడ్డారు. రిటైర్డ్ ఆఫీసర్ ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు దొంగలు చోరీల్లో పాల్గొన్నట్లు తెలిసింది. పోలీసులకు సమాచారం అందడంతో ఉదయమే ఘటనాస్థలాలకు వెళ్లి పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు.

ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు

గౌరవ్ గార్డెన్స్‌లో ఏకంగా ఐదు ఇళ్లల్లో చోరీ జరగడం నగర ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇద్దరు దొంగలు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించారు. కనీసం ఫింగర్ ప్రింట్‌లు కూడా దొరకకుండా అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. అర్ధరాత్రి 1 గంట నుంచి ఉదయం 5:15 నిమిషాల వరకు ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. అయితే ఐదు ఇళ్లల్లో విలువైన వస్తువులు చోరీకి గురికాలేదు. బంగారు లాకర్లలో పెట్టుకోవడంతో విలువైన వస్తువులు పోలేదు. ఒక ఇంట్లో 8 తులాల బంగారు, వెండి ఉన్నప్పటికీ, బీరువాలో పెట్టకుండా.. పోపు డబ్బాలో దాచుకున్నారు. దీంతో వీరి సొమ్ము భద్రంగా ఉంది. సీసీ కెమెరాల పుటేజీని సైతం పరిశీలించి పోలీసులు నిర్ధారణ చేశారు. ఇదిలా ఉండగా, చోరీ జరిగిన ఇళ్లను అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ పర్యవేక్షించారు.

ఆత్మకూరు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



మండల టాపర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థులతో బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి

ఆత్మకూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆత్మకూరు విద్యార్థులు కలెక్టర్ చేతుల మీదుగా శనివారం సన్మానం అందుకున్నారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థి భార్గవి, బీసీ వసతి గృహానికి చెందిన వై. బాబా ఫక్రుద్దీన్, డి. షాహీర్‌కు కలెక్టర్‌కు వినోద్‌కుమార్ ప్రతిభా అవార్డులు అందించారు.

మండల టాపర్‌కు సన్మానం

పదో తరగతి ఫలితాల్లో ఆత్మకూరు మండల టాపర్‌గా నిలిచిన హోలిస్పిరిట్ ప్రైవేటు పాఠశాల విద్యార్థి అంకితను శనివారం ఎంఈఓ నరసింహారెడ్డితో పాటు పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పాఠశాలలో రెండో స్థానంలో నిలిచిన బాల నరసింహారెడ్డిని సన్మానించారు. హోలిస్పిరిట్ హెచ్ఎమ్ సిస్టర్ సిసీల్, కరస్పాండెడ్ అనుపా పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం అర్బన్: సేవాదృక్పథంతో పని చేస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. సంస్థ మనుగడపై రాజకీయాలకు అతీతంగా ఈనెల 28న స్థానిక జిల్లా పరిషత్‌లో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని రెన్యూవల్ చేయకపోవడంతో సంస్థకు ఆర్థిక సమస్యలు తలెత్తాయన్నారు. సంస్థ నిర్వహించే విద్య, వైద్యం, మంచినీటి పథకాలుపై ఈ ప్రభావం పడిందన్నారు. ఈ తరుణంలో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు ముందుకు వచ్చి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ విషయంలో కేంద్రం మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించాల్సిన అవసరం ఉందన్నారు. మేధావులు, నాయకులు హాజరై అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నాయకులు రమణయ్య, అల్లీపీరా, రామకృష్ణ, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని జయించిన అక్షరం

- నేడు దివ్యాంగుడు వెంకటేష్ 'స్వాతి చినుకు' పుస్తకావిష్కరణ



వెంకటేష్

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన వెంకటేష్‌కు పక్షవాతం సోకడంతో పుట్టుకతోనే దివ్యాంగుడయ్యారు. దీంతో చిన్నతనం నుంచి నడక ఇబ్బందిగా మారింది. నోరు వంకరపోయి మాటలో స్పష్టత లేకపోయింది. కాళ్లు, చేతులు పని చేయవు. కానీ ఇవేవీ అతని పట్టుదలను వెనక్కు లాగలేకపోయాయి. ఆత్మవిశ్వాసమే పునాదిగా అక్షరంపై పట్టు సాధించాడు. చదువులో ముందుంటూ ఏకంగా మూడు పోస్ట్ గ్రాడ్యుయేషన్లు పూర్తి చేశాడు. లక్ష్మీదేవి అనే మరో దివ్యాంగురాలిని వివాహం చేసుకుని సకలాంగులతో పోటీ పడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అసాధ్యమైనదేదీ లేదని నిరూపిస్తున్నారు. తండ్రి పింఛన్‌పైనే ఆధారపడాల్సి వచ్చినా సాహిత్యంపై మక్కువతో అనేక వ్యాసాలు రచించారు. ప్రస్తుతం సొంత డబ్బుతో తాను రాసిన పుస్తకాలను అచ్చు వేయించుకుని అనంత సాహితీలోకానికి పరిచయం చేస్తున్నారు. అక్షరమే ఆయుధంగా పాఠకులను కదిలించే విధంగా అక్షర యజ్ఞం, దేశభక్తి, జాతీయవాదం, మహానేతల స్ఫూర్తి, స్వాతంత్ర దీప్తి, స్త్రీ ఔన్నత్యం, భారతీయ సంస్కృతి గొప్పతనం వంటి రచనలు ఇప్పటికే అతని కలం నుంచి జాలువారాయి. మరో రెండు కొత్త రచనలు ఆదివారం ఆవిష్కరణకు సిద్ధమయ్యాయి.

నేడు పుస్తకావిష్కరణ :

ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్ వేదికగా దివ్యాంగుడు పీజీ వెంకటేష్ కలం నుంచి జాలువారిన స్వాతి చినుకు నవల, మన ప్రభుత్వాధినేతలు పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఉదయం 10 గంటలకు తెలుగు వెలుగు సామాజిక సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ఆచార్య బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ రాజారాం, డాక్టర్ అంకే శ్రీనివాస్, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ తదితరులు వెంకటేష్ రచనల పరిచయం చేయనున్నారు. సాహిత్యాభిమానులు భారీగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకుడు టీవీరెడ్డి కోరారు.

మూగజీవాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పశువైద్య దినోత్సవంలో పాల్గొన్న పశుశాఖ జేడీ, డీడీ, ఏడీలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పశువులు, జీవాలు, ఇతరత్రా మూగజీవాల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని జేడీ కోరారు. కేవలం డాక్టర్లే కాకుండా పశుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా వైద్యసేవలు అందిస్తే సమస్త జీవకోటి సురక్షితంగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు ఏటా ఏప్రిల్ నెల చివరి శనివారం ప్రపంచ వ్యాప్తంగా వెటర్నరీడేను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆ శాఖ ఏడీలు జేడీని సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టి.సుధాకర్, ఏడీలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాధిక, డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, డాక్టర్ ప్రమీళారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కనగానపల్లి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించడంతో పాటు ఇన్‌డోర్ గేమ్స్‌పై శిక్షణ అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్డీటీపై కుట్రలు మానుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్డీటీ సంస్థపై బీజేపీ కుట్రలు మానుకోవాలని ఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు స్వచ్ఛంద సంస్థలు కూడా విలవిల్లాడుతున్నాయని పేర్కొన్నారు. ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీని వల్ల సామాన్య, మధ్యతరగతి, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఆ సంస్థకు నిధులు విడుదలయ్యేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

అనంతపురం అర్బన్: స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లోని పెన్నర్స్ భవనంలో ఆర్డీటీ సంస్థ సేవలు- ఆటంకాలు అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

నేడు గాయని జానకి జన్మదిన వేడుక

అనంతపురం కల్చరల్: పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అసోసియేషన్, ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గానకోకిల జానకి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జీవీ రామయ్య, పాలసముద్రం నాగరాజు సంయుక్త ప్రకటనలో తెలిపారు. 'మౌనమేలనోయి ఈ మరుపురాని రేయి' పేరుతో స్థానిక హౌసింగ్‌బోర్డులోని ఘంటసాల స్మారక భవనం వద్ద సాగే సంగీత విభావరిలో కళాభిమానులందరూ పాల్గొనాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు అనంతపురం వాసి



ఆత్మహత్యకు పాల్పడిన ఆనంద్(ఫైల్)

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పాడుబడిన రైల్వేక్వార్టర్స్‌లో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపిన వివరాలు.. అనంతపురంలోని కమలానగర్‌కు చెందిన దేవిరెడ్డి ఆనంద్(54) అనంతపురంలో లామినేషన్ సెంటర్ నిర్వహించేవాడు. మద్యానికి బానిసైన అతడు తరుచూ భార్య, కుమారుడితో గొడవపడేవాడు. ఈక్రమంలో భార్య తన కుమారుడితో కలిసి స్వస్థలమైన రాయదుర్గం వెళ్లిపోయింది. రెండు నెలల నుంచి తన ఇంటికి వెళ్లకుండా గుంతకల్లు, కర్నూల్ రైల్వేస్టేషన్లల్లో కాలం వెళ్లదీస్తున్న ఆనంద్ శనివారం ఉదయం పాడుబడిన రైల్వేక్వార్టర్స్‌లో నైలాన్ తాడుతో ఉరేసుకున్నాడు. మృతుడి జేబులో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా అతని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు, నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 136వ మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్మికులు ప్రాణత్యాగాలతో సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కొనసాగించాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, జిల్లా, నగర నాయకులు గోవిందు, రాజు, వెంకటేష్, బాషా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు లక్ష పుష్పార్చన



సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక కొత్తూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన జరిగింది. ఆర్యవైశ్య కులగురువు వామనాశ్రమ స్వామీజీ అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపామచ్చానరసింహులు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు వందలాది మంది మహిళలు వాసవీమాతను స్తుతించారు.

పహల్గాం మృతులకు నివాళి



టవర్‌క్లాక్ వద్ద పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

అనంతపురం: పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి వివిధ వర్గాల ప్రజలు నివాళులర్పిస్తున్నారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో , శిల్పా లేపాక్షి నగర్‌లో నివసించే స్థానికులు అక్కడ నుంచి పంగల్ రోడ్డు వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అలాగే అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ వరకూ మాజీ సైనికులు ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలో శాంతిర్యాలీ జరిగింది.

ఘనంగా అరుణాచలేశ్వరుని అనుష్టానం



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: మాసశివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకుని సాయిట్రస్టు ఆధ్వర్యంలో మూడవరోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అరుణాచలేశ్వరుని అనుష్టానం భక్తిశ్రద్ధలతో జరిగింది. శనివారం ఉదయం మహాగణపతిపూజ, సుబ్రహ్మణ్యేశ్వర పూజ, మహారుద్రాభిషేకం అనంతరం శ్రీవారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. మధ్యాహ్నం నారాయణ సేవలో వందలాది మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం జ్యోతి పూజలు, 108 హారతులతో అరుణాచలేశ్వరుడు ప్రత్యేక పూజలందుకున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చెన్నేకొత్తపల్లి: భానుడి భగభగలతో జిల్లా వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవినాయక్ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గురించి వివరించారు. ఎండలో పనిచేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ గోవిందమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం అశ్విని, ఆశావర్కర్ బాలమ్మ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

• విజయ పథం





• సోలార్ పవర్‌తో జీవితాలలో కొత్త వెలుగు

సోలార్ సఖి

రైల్లో తొలిసారి ప్రయాణించిన ఆ మహిళలు.... 'రైలు ప్రయాణం ఇంత బాగుంటుందా!' అని సంబరపడి పోయారు. ఆ తరువాత మరో ప్రయాణం మొదలు పెట్టారు. అయితే అది రైలు ప్రయాణం కాదు. తమ జీవితాలను మార్చివేసిన ప్రయాణం. చిన్న చదువులు చదువుకున్న ఎంతో మంది గ్రామీణ మహిళలు సోలార్ ఇంజినీర్‌లుగా, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు...



• సోలార్ సఖి: భవిష్యత్ తరానికి మార్గదర్శనం

రాజస్థాన్‌లో నిశ్చలగఢ్‌కు చెందిన తప్రీదేవి ఎన్నో సంవత్సరాలు విద్యుత్ సౌకర్యం లేని ఇంట్లోనే గడిపింది. అయిదవ తరగతి తరువాత తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో ఇంటి పనులు చేసేది. గొర్రెలు మేపేది. ఇల్లే ప్రపంచంగా బతుకుతున్న తప్రీ దేవి జీవితాన్ని 'సోలార్ పవర్' మార్చి వేసింది. హర్మదా(జైపూర్)లో ఐదు నెలల సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కార్యక్రమం ఆమె జీవితాన్ని కొత్త దారిలోకి తీసుకువెళ్లింది.

సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కోసం సిద్ధం అయినప్పుడు..

'ఎందుకులే' అన్నారు తల్లిదండ్రులు. వారిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చింది,

'మా కమ్యూనిటీలోని మహిళలు ఎప్పుడూ ముసుగు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లలేదు. నేను ఎప్పుడూ పట్టణ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లలేదు' అంటుంది తప్రీదేవి.

కిషన్‌గఢ్‌కు వెళ్లడం...తన తొలి రైలు ప్రయాణం! 'అది పూర్తిగా కొత్త అనుభవం. ప్రయాణంలోని ఆనందం తెలిసొచ్చింది' అంటుంది తప్రీదేవి.



• 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకున్న తప్రీదేవి

శిక్షణలో సోలార్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్‌వర్క్‌కు అవసరమైన నైపుణ్యాలు సంపాదించింది. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగివచ్చింది. 'మేము చాలా సంవత్సరాలు చీకటిలో జీవించాము. అందుకే మా జీవితాల్లో వెలుగు తీసుకురావాలనుకున్నాను' అంటుంది తప్రీదేవి.

సోలార్ ఇంజినీర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించిన తప్రీదేవి తన గ్రామానికి విద్యుత్ వెలుగులు తీసుకువచ్చింది. భారత రాష్ట్రపతి నుండి 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకుంది. ఇది కేవలం తప్రీదేవి విజయగాథ మాత్రమే కాదు... జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, నాగాలాండ్‌తో సహా పదిరాష్ట్రాలలో మూడువేల మందికి పైగా గ్రామీణ మహిళా సోలార్ ఇంజినీర్‌ల విజయగాథ.

తమ గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లను ఒంటి చేత్తో మరమ్మతు చేసే వీరు పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదిగారు. ఈ మార్పుకు కారణం హర్ష్ తివారీ నేతృత్వంలోని ఈఎంపీఐ ఇంటర్నేషనల్. ఈ సంస్థ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు సోల్డరింగ్, వైరింగ్, బ్యాటరీ సెటప్, ఫాల్ట్ ఫైండింగ్, ఇన్‌స్టలేషన్‌లలో ప్రావీణ్యం సాధించారు. గ్రామీణ మహిళలకు సాంకేతిక నైపుణ్యం, ఆర్థికస్వాతంత్ర్యం లక్ష్యంగా ఈఎంపీఐ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.

శిక్షణ అనంతరం మహిళలు తమ గ్రామాల్లో సోలార్ సొల్యూషన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. మరమ్మతులు, ఫస్ట్‌లెవల్ చెకప్‌లు నిర్వహించేందుకు వీలుగా చిన్న ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలు సజావుగా సాగేలా చూస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా సోలార్ ఇంజినీర్‌లను 'సోలార్ సఖీ' అని పిలుస్తారు.

'వ్యవసాయంతో పాటు చిన్న తరహా పరిశ్రమలలో సౌరశక్తితో నడిచే పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎంపీఐ ఇంటర్నేషనల్ సోలార్ సఖీలకు శిక్షణ ఇస్తోంది. జీవనోపాధి కల్పిస్తుంది. టెక్నికల్ ట్రైనింగ్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో కూడా శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో సోలార్ సెటప్‌లలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే సోలార్ సఖులు పరిష్కారం చూపుతున్నారు' అంటున్నాడు హర్ష్ తివారీ.

కూల్ సమ్మర్

పక్షులను చల్లగా కాపాడుకుందాం!

వేసవి కాలం పక్షులకు కష్టకాలం. అధిక వేడి పక్షులకు ప్రమాదకరంగా మారుతుంది. డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా పక్షులను రక్షించడానికి... నీరు, నీడ, గాలి ప్రసరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. కొన్ని జాగ్రత్తలు...





- పక్షులకు అన్ని వేళలా శుభ్రమైన మంచినీరు అందుబాటులో పెట్టాలి
- వేర్వేరు ప్రదేశాలలో వాటర్ బౌల్స్ పెట్టాలి
- చల్లగా, ఫ్రెష్‌గా ఉండడానికి వాటర్ బౌల్స్‌లో ఐస్ క్యూబ్స్ వేయవచ్చు
- చల్లని, సౌకర్యవంతమైన స్థలంలో పక్షులు ఉండేలా చూడాలి
- కూలింగ్ మ్యాట్స్ ఉపయోగించవచ్చు
- పక్షులపై ఒక నిమిషం లేదా అర నిమిషం నీటిని స్ప్రే చేయాలి
- పక్షులకు సమీపంలో తడి టవల్స్ ఏర్పాటు చేయాలి
- వేగంగా శ్వాస తీసుకోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, బద్ధకంగా కనిపించడం, తినడానికి ఆసక్తి చూపించకపోవడం...మొదలైనవి పక్షులకు సంబంధించి ఓవర్ హీటింగ్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి
- ఆహారం విషయానికి వస్తే.... నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ, దోసకాయలాంటివి అందించవచ్చు
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో వందలాది గ్రామాల్లో యానిమల్ యాక్టివిస్ట్‌లు వేసవి వేడి నుంచి పక్షులను కాపాడడానికి 'బర్డ్ రెస్టారెంట్స్' ఏర్పాటు చేశారు. పక్షులకు చల్లని నీడను ఇచ్చేలా నీరు, ఆహార పదార్థాలతో చెట్టు కొమ్మలపై ఈ రెస్టారెంట్‌లు ఏర్పాటు చేశారు.





• మానవత్వం

నిరీక్షణ ఫలించింది...



కొన్ని సంవత్సరాల నుంచి భర్తతో కలిసి మన దేశంలో ఉంటున్న క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ భారత్‌లో తన అనుభవాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. దిల్లీలో ఉంటున్న ఫిషర్ దంపతులు నిషా అనే దివ్యాంగురాలైన బాలికను దత్తత తీసుకోవాలనుకున్నారు. అయితే దత్తత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది.

'2023లో అక్టోబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా, 2024లో నిషాకు దగ్గరయ్యాం. 2025 ఏప్రిల్ నాటికి దత్తత పూర్తయింది. ఇప్పుడు నిషా మా అందమైన కుమార్తె' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసింది ఫిషర్.

'కౌంటింగ్ డౌన్ ది డేస్ అన్‌టిల్...' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాను దత్తత తీసుకున్న పాప కనిపిస్తుంది.

మరో వీడియోలో చిన్నారి నిషాకు సంబంధించిన ఎమోషనల్ గ్లింప్స్‌ను షేర్ చేసింది. దివ్యాంగురాలు అనే కారణంతో నిషాను చిన్న వయసులోనే తల్లిదండ్రులు వదిలేశారు. రెండు సంవత్సరాలు అనాథాశ్రమంలో పెరిగింది నిషా. 'స్పెషల్ నీడ్స్ చైల్డ్‌ను దత్తత తీసుకోవాలనుకోవడానికి కారణం...వారికి కొత్త జీవితం ఇవ్వాలనుకోవడం' అంటుంది క్రిస్టెన్ ఫిషర్.

• గుడ్ అండ్ బ్యాడ్

కిడ్‌ఫ్లూయెన్సర్... కిం కర్తవ్యం



యూ ట్యూబ్‌లో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల వైరల్ వీడియోలు ప్రవాహంలా కనిపిస్తాయి. క్యాచీ కంటెంట్‌తో లక్షల్లో వ్యూస్ సాధిస్తున్నారు. లక్షల్లో సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మన దేశంలో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తెర వెనుక కథ గురించి చర్చ మొదలైంది. షూటింగ్‌ల కోసం వారు తరచుగా స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కువ సెలవులు పెడుతున్నారా? సరిగా తింటున్నారా? తగినంత నిద్ర ఉంటోందా? కంటెంట్‌కు సంబంధించి ఒత్తిడికి గురవుతున్నారా? అందరు పిల్లల్లా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నారా... ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి.

బాగా చదివే పిల్లలు కూడా 'కిడ్‌ఫ్లూయెన్సర్' ట్యాగ్‌లైన్ పుణ్యమా అని చదువులో వెనకబడి పోతున్నారు. 'నేను చాలా సాధించాను. నేను చాలా గ్రేట్' అనే భావన పెరిగిపోతుంది. 'యాభై ఏళ్ల క్రితం అకాడమిక్ ఎక్స్‌లెన్స్ గోల్డ్ స్టాండర్డ్, ముప్పై ఏళ్ల క్రితం ఆటలు ఉండేవి. ఇప్పుడు క్రియేటివిటీ, డ్యాన్స్, మ్యూజిక్, విజువల్ కంటెంట్. ఒక్క వైరల్ వీడియో చాలు పిల్లలకు రాత్రికి రాత్రి స్టార్‌డమ్ తీసుకురావడానికి. ఈ తక్షణ పాపులారిటీ వల్లే పిల్లలు, తల్లిదండ్రులు వైరల్ కంటెంట్‌పై దృష్టి పెడుతున్నారు' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.మేఘా పుష్కర్ణ.

హెల్త్

• టూత్

ఇంటి పట్టున ఉంటారు

పంటి పని పట్టండి......



ఎముకలు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు స్వాభావికమైనవి. అయితే ఎదిగే వయసులో ఉన్న కొందరు చిన్నారులు అలవాటుగా తమ వేలిని నోట్లో పెట్టుకుని థంబ్ సకింగ్ చేస్తుంటారు. ఇది నివారించాల్సిన విషయమే అయినప్పటికీ... పిల్లల సైకలాజికల్ ఎదుగుదల దృష్టితో చూస్తే వారి ఈ అలవాటును బలవంతంగా మాన్పకూడదనీ, క్రమంగా మాన్పించాలని నిపుణులు పేర్కొంటుంటారు. ఇలా ఎముకల పెరుగుదలతో వచ్చే మార్పులతోనూ, నోట్లో వేలుపెట్టుకునే అలవాటు వల్లా పలువరస షేప్ మారవచ్చు.

కొన్ని సాధారణ దంతసమస్యలివి...

- పిప్పిపళ్లు
- చిగుర్ల సమస్యలు
- పాలపళ్లు సరైన సమయంలో ఊడకపోవడం
- ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు, పళ్ల మధ్య సందులతో సమస్యలు
- ముఖానికి దెబ్బలు తగలడం వల్ల వచ్చే సమస్యలు.

పిల్లలు ఎదుగుతూ ఉండే సమయంలో అన్ని ఎముకలతో పాటు ముఖానికి సంబంధించిన ఎముకలూ, దవడ ఎముకల్లోనూ మార్పులు వస్తుంటాయి. దాంతో చిన్నారుల్లో ఈ ఎదుగుదలకు సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించవచ్చు. అలాగే చిన్నపిల్లలు చాక్లెట్లు, స్వీట్స్, జంక్‌ఫుడ్ వంటివి ఇష్టంగా తింటుంటారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పిల్లల్లో వచ్చే కొన్ని సాధారణ డెంటల్ సమస్యలూ, వాటికి పరిష్కారాల కోసం ఈ కథనం.

పిప్పిపళ్లు...

దాదాపు 80 శాతానికిపైగా పిల్లల్లో పిప్పిపళ్లు, చిగుర్ల జబ్బులు కనిపిస్తుంటాయి. తీపి పదార్థాల ముక్కలు నోటిలోనే ఉండిపోవడంతో పెరిగిపోయిన బాక్టీరియాతో పాటు వారు సరిగా బ్రష్ చేసుకోకపోవడం వల్ల ఆ పెరిగిన బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో నోటిలోనే ఉండిపోవడం, అవి విడుదల చేసే హానికర రసాయనాల వల్ల పళ్లలో రంధ్రాలు ఏర్పడి పిప్పిపళ్లు రావచ్చు. రంధ్రాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ ఆహార వ్యర్థాలు అక్కడ ఎక్కువగా ఇరుక్కుపోవడం, దాంతో రంధ్రం మరింతగా పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్స్ వచ్చి నొప్పి రావచ్చు. ఇలాంటి పిప్పిపళ్ల కారణంగా చిన్నారులు ఆహారం నమలడానికి ఇబ్బందిపడతారు. అన్నం తినడాన్ని అవాయిడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమకు వచ్చే నొప్పిని తల్లిదండ్రులకు సరిగా చెప్పలేక ఇలా అన్నం తినడానికి నిరాకరిస్తుంటారు. దాంతో ఎదుగుదల కూడా ఎంతో కొంత ప్రభావితం కావచ్చు.

చికిత్స...

పిప్పిపళ్లకు సరైన సమయంలో చికిత్స చేయించకపోతే ఇన్ఫెక్షన్ పంటి ఎముక వరకు చేరి, పాల పళ్లతో పాటు తర్వాత రావాల్సిన శాశ్వతదంతాలూ పాడయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఇలాంటి పిల్లలను దంతవైద్యులకు చూపించినప్పుడు వారు పంటిలోని రంధ్రాలను పూడ్చివేయడం, ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తగిన యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తారు.



చిగుర్ల జబ్బులు...

చిన్నారులకు బ్రషింగ్ నైపుణ్యాలు అంతగా తెలియకపోవడంతో పళ్లలో చిక్కుకున్న ఆహారపదార్థాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం కారణంగా పిప్పిపళ్లతో పాటు చిగుర్ల సమస్యలు వచ్చే ముప్పు ఉంటుంది. దీనికో కారణముంది. నోట్లో విపరీతంగా పెరిగిపోయిన బ్యాక్టీరియా, ఆహారపదార్థాలతో కలిసి ప్లాక్, క్యాలికులస్ అని పిలిచే మురికి సున్నితమైన చిగుర్ల చివర్లలోకి చేరుతుంది. ఈ మురికి కారణంగా చిగుర్లలో వాపు, కొందరిలో చిగుర్ల నుంచి రక్తస్రావం కావడం, నోటి దుర్వాసన వంటి సమస్యలు కూడా రావచ్చు. చిన్నవయసులోనే చిగుర్ల జబ్బు వస్తే పిల్లలు జీవితకాలం దృఢమైన పళ్లు లేక ఇబ్బంది పడవలసి రావచ్చు.



డా. వికాస్ గౌడ్, డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్

చికిత్స...

జింజివైటిస్ వంటి సమస్యలకు తగిన యాంటీబయాటిక్స్ వాడటంతో పాటు చిగుర్లకు వచ్చే సమస్యను బట్టి దంతవైద్యులు పలు రకాల చికిత్సలు అందిస్తారు.

ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు పళ్లు / వంకరపళ్ల వంటి సమస్యలు...

ఎత్తుపళ్లు అన్నది పిల్లలను ఆత్మన్యూనతకు గురిచేసే సమస్య. మొదట్లో ఇది నివారించదగిన సమస్యే అయినప్పటికీ, తల్లిదండ్రుల అవగాహనాలోపం, మరి కొందరిలో వారి నిర్లక్ష్యం వల్ల ఇది తీవ్రమవుతుంది.

ఎత్తుపళ్లు / ఎగుడుదిగుడు పళ్లు / వంకర పళ్లకు కారణాలు...

- ఎత్తుపళ్లు చాలావరకు వంశపారంపర్యంగా వస్తుంటాయి. తల్లిదండ్రుల్లో ఒకరికిగానీ లేదా ఇద్దరికీ ఎత్తుపళ్లు ఉంటే పిల్లల్లోనూ వచ్చే అవకాశాలు 70 శాతానికి పైమాటే. పిల్లలకు ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు / వంకరపళ్లు, పళ్లమధ్య సందులు రాకుండా చేసే చికిత్సలు సైతం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.
- నోట్లో వేలుపెట్టుకోవడం, పెదవులు కొరకడం, నాలుకతో పళ్లను ముందుకు తోస్తూ ఉండటం, నోటితోనే గాలిపీల్చడం వంటి అంశాలూ ఎత్తుపళ్లకు కారణమవుతుంటాయి. ఎదుగుతున్న చిన్నారుల దవడ ఎముకలు మైనంలా ఒత్తిడి పడుతున్న దిశకు వంగిపోతుంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ పేర్కొన్న దురలవాట్లు ఉన్న పిల్లల్లో దవడ ఎముకల షేపు మారిపోయి పళ్లు ఎత్తుగా రావచ్చు.
- పాలపళ్లు సమయానికి ఊడిపోకపోయినా, పిప్పిపళ్లను ముందే తీసేయాల్సి వచ్చినా ఎత్తుపళ్లు లేదా ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు రావడానికి ఈ అంశాలు కూడా ఒక కారణం.

ఎదిగే వయసులోనే ఎత్తుపళ్లను, ఎగుడుదిగుడు దంతాలనూ, సరిచేయడం, పళ్ల మధ్యన ఉండే సందులు చక్కదిద్దడం చాలా సులువు. చికిత్స ఫలితాలు కూడా దాదాపు నూరు శాతం ఉంటాయి. ఎదిగే వయసులో వచ్చే 'గ్రోత్ స్పర్' అనేది చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చికిత్స త్వరగా, సమర్థంగా జరిగేందుకు ఈ గ్రోత్ స్పర్ అంశం సహాయపడుతుంది.

ఎత్తుపళ్ల సమస్య రెండు రకాలుగా ఉండవచ్చు...

- కేవలం పళ్లు మాత్రమే ఎత్తుగా ఉండటం
- పళ్లతో పాటు దవడ ఎముకలు కూడా ఎత్తుగా ఉండటం.

పిల్లలు నవ్వినప్పుడు చిగుర్లు ఎక్కువగా కనిపించడం, నిద్రపోతున్నప్పుడూ పెదవులు తెరచుకునే ఉండటం, పెదవులు ముందుకు వచ్చినట్లుగా కనపడటం వంటివి ఎముక కూడా ఎత్తు పెరిగిందని చెప్పడానికి గుర్తులు.

చికిత్స...

- ఎదిగే వయసులో ఎత్తుగా ఉన్నట్లు గుర్తిస్తే... ఎలాంటి శస్త్ర చికిత్సలూ లేకుండానే పళ్లు, దవడలను ప్రత్యేకమైన క్లిప్స్‌తో సరిచేయవచ్చు. అయితే... ఎదిగిన పిల్లల్లో దవడ ఎముకలు ఎత్తుగా ఉంటే సర్జరీ చేయాల్సి రావచ్చు.
- పళ్లు ఎత్తుగా ఉన్నా, పళ్ల మధ్య సందులు ఉన్నా, వంకర టింకరగా ఉన్నా, ఎగుడుదిగుడుగా ఉన్నా క్లిప్పులతో వాటిని సరిచేయవచ్చు. అయితే పిల్లలకు అమర్చాల్సిన క్లిప్పులు అందరిలో ఒకేలా ఉండవు. వ్యక్తిగతమైన పరీక్షల తర్వాతే వారికి సరిపోయేవాటిని నిర్ణయించాల్సి ఉంటుంది.



పాలపళ్లు సరైన టైమ్‌లో ఊడకపోవడం...

సాధారణంగా పాలపళ్లలోని ప్రతి పన్నూ ఓ నిర్దిష్ట సమయం తర్వాత ఊడుతుంది. శాశ్వత దంతం తయారై బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడే పాలపన్ను ఊడుతుంది. ఊడిన 3 నుంచి 4 నెలల్లో శాశ్వత దంతం వచ్చేస్తుంది. ఏ కారణం వల్లనైనా పాలపన్ను ఊడకపోతే, దానికి ముందువైపో, వెనకవైపు నుంచో శాశ్వత దంతం వస్తుంది. (కొన్నిసార్లు పాల పన్ను ఊడకపోవడం వల్ల శాశ్వత దంతం బయటకు రాలేక చిగురులోనే చిక్కుకుపోవచ్చు కూడా). దాంతో రెండు వరసల్లో పళ్లు కనపడతాయి. అందుకే ఆరేళ్లు దాటిన పిల్లలను దంతనిపుణులకు తరచూ చూపిస్తూ పాలపళ్లు సరైన సమయంలోనే పడిపోతున్నాయా లేదా అని పరీక్ష చేయిస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారి పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.

పరీక్షలు : ఎక్స్-రే సహాయంతో పాలపళ్లు, శాశ్వత దంతాలను, శాశ్వతదంతాలను చిక్కుకుపోయిన తీరును దంతవైద్యులు తెలుసుకోగలరు.

ముఖానికి దెబ్బలు తగలడం వల్ల...

ఎదిగే పిల్లలు ఆటలాడుతుంటారు. పైగా ఇవి సెలవురోజులు కావడం ఆడుకోవడం మరింత ఎక్కువ. ఆటల్లో పరుగెత్తుతూ పడిపోవడం, దెబ్బలు తగలడం, క్రికెట్ బంతి లేదా ఇతర బంతుల వంటివి తగలడం, పిల్లలు పోట్లాడుకోవడం వంటి చర్యలతో ముఖానికి దెబ్బలు తగలడం, పళ్లు విరగడం / వంగిపోవడం, దెబ్బలు తీవ్రమైనవైతే పెదవులు చీలడం, ముక్కు వంకర కావడం కూడా జరగవచ్చు.

ఇలా దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పలువరస షేపు మారడం, పళ్లపై గుర్తులు ఏర్పడి అలాగే ఉండిపోవడం జరగవచ్చు. అందుకే పన్ను విరిగినా, ఊడినా వెంటనే ఆ ముక్కను పాలలో లేదా మంచినీళ్లలో ఉంచి దంతవైద్యులను కలవాలి.

వేసవి సెలవులు దంతవైద్యం చేయించడానికి అనువైన సమయం. ఈ సమయంలో స్కూళ్లకు సెలవులు ఉంటాయి కాబట్టి పిల్లల చదువులు వృథా కాకుండానే చికిత్స చేయించవచ్చు. పైగా చికిత్స తర్వాత వారు ఇంటిపట్టునే ఉంటారు కాబట్టి టైముకు మందులు ఇవ్వడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోడానికి, పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వడానికి సెలవులన్నవి సరైన సమయం. కాబట్టి తల్లిదండ్రులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, పంటి సమస్యలున్న పిల్లలకు తగిన వైద్యసహాయం అందించాలి.

• ఫుడ్

జంకొద్దు

వేసవిలో పిల్లలకు ఆహారం ఇవ్వాలంటే రెండు అంశాలు గుర్తుపెట్టుకోవాలి. మొదటిది వేసవి వేడిమి. రెండోది సెలవుల్లో వాళ్ల ఆటలు. నగరాల్లోని పిల్లలు ఎండల్లో పెద్దగా ఆడే అవకాశం లేకపోయినా పట్టణాల్లో, పల్లెల్లోని పిల్లలు ఇలా ఎండ వేడిమిలో ఆడటం మామూలే. అలాగే పెద్ద నగరాల్లోంచి సెలవులకు పల్లెలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గినప్పటికీ... కొంతమంది ఇప్పటికీ ఇలా వచ్చేవారు లేకపోలేదు. ఇలా వేసవిలోని వేడిమిని తట్టుకుంటూ... ఎక్కువ సమయం ఆటలకు ఇచ్చుకుంటూ ఉండేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తూ ఉండటానికి చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలిపే కథనం.



- **అధిక శక్తికోసం పాల ఉత్పత్తులు...** పిల్లలకు తాజా లస్సీ, తాజా మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఫ్రూట్ మిల్క్ షేక్‌లు (మ్యాంగో మిల్క్ షేక్) వంటివి ఇవ్వడం వల్ల ఒకపక్క అవి ద్రవాహారాలుగా వారు కోల్పోయే నీరు లవణాలను భర్తీ చేయడంతో పాటు ప్రొటీన్లనూ అందజేస్తాయి. ఎదిగే వయసులో ఎముకల బలం కోసం క్యాల్షియమ్‌ను ఇస్తాయి.
- **తాజా పండ్లు...** పిల్లలకు తాజా పండ్లు తినిపించడం ఎప్పుడూ మంచిదే. కాకపోతే పండ్ల రసాలకు బదులు వీలైనంతగా పండ్లను కొరికి తినేలా చూడాలి. ద్రవాలను భర్తీ చేయడం కోసం, వేసవి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ చల్లగా ఉండే తాజా పండ్ల రసాలనూ ఇవ్వవచ్చుగానీ... వీలైనంత వరకు వాటిలో చక్కెర కలపకపోవడం మంచిది.
- **జంక్‌ఫుడ్ వద్దు...** బర్గర్‌లు, పిజ్జాలు, చిప్స్ వంటి వాటి కోసం వాళ్లు మారాం చేస్తున్నప్పటికీ ఆరోగ్యానికి అవి హానికరమంటూ వాళ్లను సముదాయించడం మంచిది. ఆ వయసు పిల్లలను సమాధానపరచడం కష్టం కాబట్టి వాటిలో పనీర్, తాజాకూరగాయలు పుష్కలంగా నింపి ఇవ్వడం మంచిది. అయితే వాటిల్లో చీజ్ ఎక్కువగా ఉన్నవాటిని తినిపించడం అంతగా మంచిది కాదు. మరీ మారాం చేస్తుంటే గ్రిల్డ్ వెజిటబుల్స్‌ను పనీర్‌తో కలిపి ఇవ్వవచ్చు.



- **ఐస్‌క్రీముల విషయంలో...** వేసవిలో ఐస్‌క్రీములు అడగని పిల్లలు ఉండరు. ఇంట్లో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ కస్టర్డ్స్, పుడింగ్స్, స్మూతీస్ వంటివి పిల్లలకి పెట్టవచ్చు. ఇవి ఆరోగ్యకరమే. ఇక కూల్‌డ్రింక్స్ కోసమూ డిమాండ్ ఎక్కువగానే ఉండవచ్చుగానీ వాటిని ఇవ్వడం అంతమంచిది కాదని గుర్తుంచుకోండి